క్లుప్తంగా

ల్యాండ్ డైవర్షన్ భూమిని సందర్శించిన డీఎఫ్ఓ



రిజర్వ్ ఫారెస్ట్ భూమిని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

కణేకల్లు: రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు ల్యాండ్ డైవర్షన్ చేసే భూమిని డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పావు సందర్శించారు. కణేకల్లు–ఉరవకొండ మార్గమధ్యంలో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌కు సమానంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.48 కోట్లు మంజూరయిన విషయం విదితమే. ఈ బ్రిడ్జి నిర్మించే స్థలం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తుండటంతో ల్యాండ్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ భూమిని తమశాఖకు డైవర్షన్ చేయాలని ప్రతిపాదనలు పంపారు. అరెకరాల మేర బ్రిడ్జి నిర్మాణానికి స్థలం అవసరం ఉంది. దీంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డితో కలిసి డీఎఫ్ఓ ల్యాండ్ డైవర్షన్ చేయనున్న భూమిని సందర్శించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి, జేఈ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు

బెళుగుప్ప: మండలంలోని ఆవులెన్న, బెళుగుప్ప తండా, బెళుగుప్ప గ్రామాల సమీపంలో రాత్రివేళల్లో చిరుత సంచరిస్తుండడంతో రైతులు వ్యవసాయతోటల వద్దకు వెళ్లాలంటే జంకుతున్నారు. సోమవారం రాత్రి ఆవులెన్న సమీపంలోని వ్యవసాయ తోటల్లో చిరుత కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. బెళుగుప్ప తండా సమీపంలోని వ్యవసాయ తోటల్లో చిరుత సంచరించిన కాలి అడుగులను గుర్తించి అటవీశాఖ బీట్ ఆఫీసర్‌కు తెలియజేశారు. గుండ్లపల్లి అటవీశాఖ పరిధిలో చిరుతలు సంచరిస్తున్నాయని, బుధవారం రేంజర్‌తో కలసి గ్రామాల్లో పర్యటిస్తామని బీట్ ఆఫీసర్ పెద్దన్న తెలిపారు.

కొనసాగుతున్న సమ్మె



కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

రాయదుర్గంటౌన్: డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం మూడోరోజూ కొనసాగింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో సోమవారం కార్మికులు, సీఐటీయూ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో డిమాండ్‌లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించకపోతే 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా, శీనప్ప, తదితరులు పాల్గొన్నారు.

తుది దశ పాలిటెక్నిక్ ప్రవేశాలు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు తుది దశ షెడ్యూల్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అశ్రాఫ్అలీ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన సివిల్ ఇంజనీరింగ్ శాఖాధిపతి, జనరల్ విభాగం శాఖాధిపతితో కలిసి మాట్లాడారు. మొదటి కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు ఈనెల 17 నుంచి 19 వరకు అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, హెల్ప్‌లైన్ సెంటరుకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి, రెండో కౌన్సెలింగ్‌కు హాజరైన వారు 18 నుంచి 20 వరకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు, గుంతకల్లు, బెళుగుప్ప, కూడేరు విద్యార్థులకు సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

కూడేరు: మరుట్ల–2వ కాలనీలోని హైస్కూల్ పని చేస్తున్న ఉపాధ్యాయులు వేణుగోపాల్ (సైన్స్), జయప్రసాద్ (ఇంగ్లిష్), సరస్వతి(మ్యాథ్స్) బదిలీయ్యారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. హెచ్ఎం ధనుంజయ్య, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతీ యువకుడికి గాయాలు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు కామారుపల్లి సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న యువతీయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు, యువతి ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు మీదుగా అనంతపురానికి బయలుదేరారు. కామారుపల్లి శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి ఎదురుగా కళ్యాణదుర్గం వైపు వెళుతున్న మినీవ్యాన్‌ను ఢీ కొన్నారు. తీవ్రంగా గాయపడిన యువతి, యువకుడిని 108 వాహనంలో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

అంతర్గత అవస్థలు

- నరకం చూపిస్తున్న పట్టణ రహదారులు
- విస్తరణలేక .. అభివృద్ధికి దూరంగా
- ఇష్టారాజ్యం నిర్మాణాలతో ప్రజల ఇబ్బందులు
- ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- రాయదుర్గంలోని దాసప్పరోడ్డులో చికెన్, మటన్, ఫిష్ మార్కెట్లు ఉన్నాయి. ఉదయం ఏడు గంటలు దాటితే చాలు ఈ దారి మొత్తం వాహనాలతో నిండిపోతుంది. పాదచారులు వెళ్లేందుకు సైతం ఇబ్బందిగా ఉంటుంది. ఇరుకుగా ఉన్న ఈ రోడ్డు గుండా అత్యవసరంగా వెళ్లాల్సిన వారు తెలియక ఇటువైపు వస్తే ఇరుక్కుపోక తప్పదు.

- రాయదుర్గంలోని మేదర వీధికి ఆనుకొని ప్రైవేట్ బస్టాండ్ ఉంది. ఈ రహదారిలోనే ప్రైవేట్ బస్సులు, ఆప్పే డీజిల్ ఆటోలు నిత్యం నడుపుతుంటారు. ఎదురుగా ఒక్క వాహనం వచ్చినా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. రహదారి ఇరుకుగా ఉండడంతో వన్‌వే ఉంటే సరిపోతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తారు.

రాయదుర్గం: పట్టణంలోని రహదారులపై వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇరుకు రోడ్లపై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో కార్యాలయాలు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. కీలక ప్రధాన రహదారుల్లోనే కాకుండా .. అంతర్గత రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నా ప్రభుత్వ శాఖల అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

కొత్త మాస్టర్ ప్లాన్ అమలులో ఉదాసీనత..

పట్టణాభివృద్ధిలో కీలకమైన బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపకల్పనలో పురపాలక సంఘ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దశాబ్దాల క్రితం రూపొందించిన ప్రణాళికనే ప్రాధాన్యతగా తీసుకొని చేపట్టిన పనులతో పట్టాణాభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది. గతంలో 20 అడుగుల రోడ్లు కలిగి ఉన్న భవనాలకు అనుమతి పత్రాలు జారీ అయ్యాయి. కొత్తమాస్టర్ ప్లాన్ అమల్లోకి తీసుకొస్తే 30 అడుగులకు పెంచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది. దీంతో పట్టణంలోని 32 వార్డుల్లో ఇరుకుగా ఉండే అంతర్గత రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేవి.



రాయదుర్గం పట్టణంలోని అంతర్గత రహదారి దుస్థితి..

పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్య..

పట్టణంలోని 2011 జనాభా లెక్కల ప్రకారం 75 వేల మంది జనాభా ఉన్నారు. గడిచిన 14 ఏళ్లలో ఈ సంఖ్య మరింత పెరిగి లక్షకు చేరువైంది. రోజు వివిధ పనులపై గ్రామీణ ప్రాంతాల నుంచి 20 వేలకుపైగా జనం వచ్చిపోతుంటారు. పెద్ద, చిన్న రోడ్లు సుమారు 100 కిలో మీటర్లకు పైగా ఉన్నాయి. కరోనా తర్వాత వాహనాల సంఖ్య మరింత పెరిగింది. జనాభాకనుగుణంగా వాహనాలున్నా.. ఆ మేరకు రహదారులు మాత్రం విస్తరించలేదు. పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నా .. అక్రమాలు చూస్తే అంతస్తులు దాటిపోతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పార్కింగ్, ఇతర అవసరాలకు వదిలిపెట్టకుండా ప్లాన్‌లను పక్కనపెట్టి నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చెపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులతోనే సరిపెడుతున్నారు.

దశాబ్ద కాలంగా రోడ్ల విస్తరణ లేదు..

దశాబ్ద కాలంగా అంతర్గత రోడ్ల విస్తరణ చేయలేదు. గతంలో ఒక ఇంట్లో ఒక సైకిలో.. లేదా ద్విచక్రవాహనమో.. నాలుగు చక్రాల వాహనం ఉంటే గొప్ప.. ఇప్పుడు ఇంటింటికీ ఒకటి లేదా మూడు బైకులు ఉన్నాయి. అభివృద్ధి చెందిన కాలనీల్లో రెండిళ్లకో కారు కనిపిస్తోంది. ఈ మేరకు రోడ్ల విస్తరణ లేకపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పట్టణంలోని దాసప్ప, ఓబుళాచారి, మేదర, కొలిమి, దుగ్గిలమ్మ ఆలయం, నేసేపేటలోని పలు రహదారులు విస్తరణ జరగాల్సి ఉంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కొత్తమాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తేనే...

కొత్త మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వస్తే పట్టణంలో మౌలిక సౌకర్యాలు మరింత మెరుగుపడుతాయి. ఆ దిశగా ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. రోడ్ల విస్తరణ జరుగుతుంది. రోడ్లను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టేవారిపై నిఘా ఉంచి నోటీసులు జారీ చేయిస్తున్నాం. జనాభ పెరుగుదలతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపవుతున్నాయి. నియంత్రణకు చర్యలు చేపట్టేలా కృషి చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

భక్తిశ్రద్ధలతో కొడిపీర్ల పెద్ద సరిగెత్తు వేడుకలు



ఎంఎంహళ్లిలో పీర్లు జలధికి వెళ్తున్న దృశ్యం



ఉరవకొండ రంగావీధిలో జలధికి తరలివెళ్తున్న హసేన్, హుసేన్ పీర్లు



హసేన్, హుసేన్ పీర్ల చావిడి వద్ద నిప్పుల గుండంలో నమాజ్ చదువుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్న మొహర్రం (కొడీపీర్లు) వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి 9వ రోజు పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. కురాగులగుట్ట ఆంజనేయస్వామి హుస్సేన్, హుస్సేన్ పీర్లమకాన్, జేఆర్ఎస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, చర్చి ఏరియా, మధుటాకీస్ ఏరియా, పాటిల్‌నగర్, ఓబుళాచారి రోడ్డు, ఊరువాకిలి, కూరగాయల మార్కెట్ వద్ద తదితర ప్రాంతాల్లోని పీర్ల చావిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు చెక్కర, బెల్లం చదివింపులు గావించారు. బుధవారం సాయంత్రం ఉరువాకిలి వద్ద పీర్ల ఊరేగింపు అనంతరం జలధి ఉంటుందని ముజావర్లు తెలిపారు.

చిన్న పీర్లకు ప్రత్యేక ఫాతేహాలు

కణేకల్లు: కణేకల్లులో మొహర్రం వేడుకల్లో భాగంగా చిన్నపీర్ల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తొమ్మిదో రోజు చిన్నపీర్లను ముజావర్లు వస్త్రాలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు చిన్నపీర్లకు చక్కెరతో ఫాతేహాలు చేయించి, పానకాలు సమర్పించారు. బుధవారం రోజు చిన్నపీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జలధికి తరలివెళ్లిన పీర్లు

ఉరవకొండ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన రంగావీధిలో కొలువుదీరిన హసేన్, హుసేన్ పీర్లు మంగళవారం భారీ ఊరేగింపుతో జలధికి తరలివెళ్లాయి. ముల్లాషఫీ, ముల్లా మహ్మద్ హుసేన్, ఆజీజ్, సాయిల ఆధ్వర్యంలో పీర్లస్వాములను ఊరేగించారు. స్థానిక నాల్గో వార్డులో వెలసిన లాలుస్వామి పీర్లను జలధికి తరలించారు.



ఆంజనేయస్వామి, హుసేన్ హుసేన్ పీర్లచావిడిలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఎంఎంహళ్లిలో జలధికి తరలిన పీర్లు

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లి గ్రామంలో మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా మంగళవారం పీర్ల జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవాయిద్యాల నడుమ వన్నూరు స్వామి, కుళ్లాయిస్వామి, ఇతర పీర్లను గుండం నుంచి వీధుల్లో జలధికి తరలించారు. పీర్లను వీక్షించడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

నిప్పుల గుండంలో కూర్చొని నమాజ్

ఉరవకొండ: స్థానిక రంగావీధిలోని 6వ బ్లాక్‌లో ప్రసిద్ధి గాంచిన హసేన్, హుసేన్ పీర్లచావిడి వద్ద చిన్న పీర్లపండుగను పురస్కరించుకొని పీర్ల చావిడి నిర్వాహకులు ముల్లాషఫీ, సాయి భగ భగ మండుతున్న నిప్పుల గుండంలో మంగళవారం తెల్లవారుజామున జానిమాజ్ వేసుకొని నమాజ్ చదివారు. ఈసందర్భంగా చావిడి నిర్వాహకులు ముల్లా అహ్మద్‌హుసేన్, ఆజీజ్ మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నామన్నారు. నిప్పుల గుండంలో కూర్చొని నమాజ్ చదివే దృశ్యాన్ని చూడటానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి, హసేన్, హుసేన్ పీర్లకు చక్కెర చదివింపులు చేశారు.



తొమ్మిదో రోజు కొలువుదీరిన చిన్నపీర్లు

బంగారు కుటుంబాల దత్తత వేగవంతం చేయాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: జీరో పావర్టీ పీ–4 కార్యక్రమం కింద రాయదుర్గం మున్సిపాలిటీలో ఇది వరకే గుర్తించిన అట్టడుగున్న ఉన్న బంగారు కుటుంబాల దత్తత తీసుకునే మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ ఉద్యోగుల తోపాటు సచివాలయ ఉద్యోగులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. దాతల గుర్తింపుతో పాటు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకునేలా కృషి చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో 1213 మంది బంగారు కుటుంబాలు గుర్తించినట్లు తెలిపారు. నెలాఖరులోపు రోజూ కనీసం 50 నుంచి 100 కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ కిశోర్ పాల్గొన్నారు.

22న పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ, టెంకాయల అమ్మకం, వంట సామాన్లు బాడుగకు ఇచ్చే హక్కులకు సంబంధించి ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమేష్ బాబు మంగళవారం తెలిపారు.

కోరంలేక సమావేశం వాయిదా



అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

బొమ్మనహాళ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అధ్యక్షతన మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక వాయిదా వేశారు. ముందుగా ఎంపీటీసీ సభ్యురాలు శివశంకరమ్మ భర్త యువరాజ్ వచ్చి ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వలేదు.. సమావేశంలో ఎలా సంతకం చేస్తారని, ఎందుకు ఇన్ని నెలల గౌరవవేతనం మంజూరు చేయలేదని అధికారులతో వాగ్వాదం చేశారు. బిల్లులు పంపించామని ట్రెజరీ నుంచి రాలేదని అధికారులు సమాధానం ఇచ్చారు. గౌరవవేతనం మంజూరు చేయకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు తిమ్మప్ప, చిక్కన్న, రాజేశ్వరి, శివశంకరమ్మ, వైస్ ఎంపీపీ రమేష్ బాయ్‌కాట్ చేశారు. తహసీల్దారు మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ ఎంపీటీసీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం ఎంపీపీ పద్మ చాంబర్‌లో సమావేశం నిర్వహించేందుకు అధికారులు చర్చలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం వాయిదా పడకుండా జరిపేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న నాగమల్లి ఓబులేసు

ఉరవకొండ: యాజమాన్య పద్ధతులు పాటించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిచ్చే పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. స్థానిక బళ్లారి బైపాస్‌లోని యాదవ కళ్యాణ మంటపంలో ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగమల్లి ఓబుళేసు ఆధ్వర్యంలో వ్యవసాయ రైతు శిక్షణ ఇచ్చారు. ఉదయం రైతు కుటుంబాలకు కిమ్స్ సవేరా ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి రేకులకుంట అగ్రికల్చర్ రీసోర్స్ స్టేషన్ విజయ్‌శంకర్‌బాబు, అగ్రికల్చర్ రీసోర్స్ శాస్త్రవేత్త మాధవీ లత మిల్లెట్స్, మెట్ట పంటల సంరక్షణ, సబ్సిడీ పథకాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్‌ల సబ్సిడీ తదితర అంశాలపై వివరించారు. కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్, ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణుడు పాల్గొన్నారు.

వేరుశనగకు యూరియా పిచికారీ చేయండి

కూడేరు: వర్షాభావంతో వేరుశనగ ఎండుముఖం పడితే లీటర్ నీటిలోకి 20 గ్రాములు యూరియా, 5 గ్రాముల 191919 కలిపి పిచికారీ చేస్తే పంటను కొద్ది రోజులు కాపాడుకోవచ్చని ఏఓ శుభకర్ తెలిపారు. మంగళవారం కడదరకుంట సమీపంలోని వేరుశనగను పరిశీలించారు. ఏఓ శుభకర్ మాట్లాడారు. బోర్ల కింద ఎకరాకు 60–70 కేజీల లోపు, వర్షాధారం కింద ఎకరాకు 60 కేజీలు మాత్రమే వేరుశనగ విత్తనాలు విత్తుకుంటే పెట్టుబడి తగ్గుతుందని, దిగుబడి బాగుంటుందని రైతులకు తెలిపారు. వేరుశనగ పంటకు ఆకుముడత, లద్దె పురుగు ఆశిస్తే లీటర్ నీటికి 2 ఎంఎల్ క్లోరో, 1 ఎంఎల్ నవోలిరిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ రాఘవేంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మారెమ్మ దేవతకు ఒడి బియ్యం



మారెమ్మ దేవతకు ఒడి బియ్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కూడేరు: కూడేరువాసులు వర్షాలు కురవాలని ఉరవకొండ మండలంలోని రాంపురం మారెమ్మ దేవతకు మంగళవారం ఒడి బియ్యాన్ని తీసుకెళ్లారు. తొలుత గ్రామ దేవతలైన పెద్దమ్మ, మారెమ్మ, పోతులయ్య, బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఇంటింటా బియ్యం, బేడలు, టెంకాయలు సేకరించారు. వాటన్నింటిని ట్రాక్టర్‌లో ఉంచి ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి డప్పుల మోత నడుమ ఊరేగింపుగా రాంపురం తరలి వెళ్లారు.

కాంగ్రెస్ నేతకు నివాళి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బాలా నరేంద్రబాబు (62) అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మంగళవారం బాలా నరేంద్రబాబు మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమా తదితరులు నివాళులర్పించారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి, మాజీ మండల కన్వీనర్ సత్యోత్తం, నాయకులు దొడగట్ట నారాయణ, నరేంద్రరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సభ్యుల నిలదీత

కణేకల్లు: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా పూర్తిగా బంద్‌కావడంతో గ్రామాల్లో తాగునీళ్ల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని సభ్యులు నిలదీశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వంద్రయ్య అధ్యక్షతన కణేకల్లు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీటీసీలు జయరాం, మారెన్న, బిదరకుంతం గ్రామ సర్పంచు హనుమంతప్ప మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో కొద్దిసేపు టీడీపీ ఎంపీటీసీ, సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఎంపీడీఓ విజయసింహారెడ్డి మాట్లాడుతూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకం వర్కర్లకు వేతనాలు మంజూరయ్యాయని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. రీ సర్వేలో జాయింట్ ఎల్ఎంపీ కారణంగా అందరి భూములకు ఒకే సర్వే నంబర్ ఉండి, భూములు ఎక్కువగా చూపిస్తున్నాయని త్వరలో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. సమావేశంలో ఏఓ జగదీష్, వెటర్నరీ వైద్యుడు వెంకటరెడ్డి, ఎంఈఓలు లక్ష్మన్న, భవానీ శంకర్, హౌసింగ్ ఏఈఈ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యపై వాగ్వాదానికి దిగిన సభ్యులు

ఎక్కడ చూసినా చెత్తదిబ్బలు, మట్టి కుప్పలే



కంబదూరు రోడ్డు పక్కనే దిబ్బలుగా ఉన్న చెత్తా చెదారం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి బైపాస్ వరకు ఎక్కడ చూసినా చెత్త దిబ్బలు, మట్టి కుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం రోడ్డుపైకి రాడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ల పక్కనే మట్టి కుప్పలు ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. వీటిని తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.

ఓటర్ల నమోదు, మార్పు చేర్పులు నిరంతర ప్రక్రియ

రాయదుర్గంటౌన్: ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని ఈఆర్ఓ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, మార్పులపై అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. 1200 మంది కంటే అధికంగా ఓటర్ల సంఖ్య ఉంటే సదరు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపడతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

ఉరవకొండ రూరల్: సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలం పరిధిలోని పెద్ద కొకుంట్ల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలో సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పంట దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రతలు రైతులకు తెలిపారు. ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు హెచ్‌బీ పరీక్షలు

బ్రహ్మసముద్రం : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల్లో రక్త హీనతను అధిగమించడానికి, విద్యార్థులను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ– 2 కృష్ణా నాయక్ , సూపర్‌వైజర్ రామలక్ష్మి, ప్రిన్సిపాల్ శీలసౌజన్య, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, హెచ్ఎస్ రామలక్ష్మి ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు నైపుణ్యం అవసరం

బొమ్మనహాళ్: విద్యార్థులకు నైపుణ్యం కూడా అవసరమని ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, ప్రిన్సిపాల్ కమలమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో వరల్డ్ యూత్ స్కిల్ డే నిర్వహించారు. విద్యార్థులు తయారీ చేసిన కుట్లు, అల్లికలు, కుట్టు విషన్ కట్టింగ్ తదితర వాటి నమూనాలు ప్రదర్శించారు.

టెంకాయల వేలం ప్రశాంతం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం టెంకాయల వేలం పాట ప్రశాంతంగా సాగింది. ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. 11 మంది వేలం పాటలో పాల్గొనగా, జి. కాంతరాజు అనే వ్యక్తికి రూ.6.71 లక్షలు వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ.6.22 లక్షలకు పోగా, ఈ ఏడాది అదనంగా రూ. 49 వేలు ఆదాయం వచ్చిన్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

రేషన్ సక్రమంగా అందించాలి

కూడేరు: రేషన్‌కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందించాలని సీఎస్‌డీటీ శాంతకుమార్ డీలర్లకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని అంతరగంగ, ఇప్పేరు, పి.నాగిరెడ్డి పల్లి గ్రామాల్లో సీఎస్‌డీటీ పర్యటించి, రేషన్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు, 65 ఏళ్లు పైబడిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే

వజ్రకరూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ గంగాధర్ ఆధ్వర్యంలో వరల్డ్ యూత్‌స్కిల్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, సర్పంచు మోనాలిసా, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొకుంట్ల రవి, సాకే గోవిందు, హరిప్రసాద్‌యాదవ్, మల్లికార్జున, ఆదర్శపాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ హిదాయతుల్లా, ప్రిన్సిపాల్ గంగా ధర్, వార్డు సభ్యుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్ష లత పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధి కోర్సును ప్రారంభించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, అర్థమెటిక్ అండ్ రీజనింగ్ స్కిల్స్ నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.